క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



పెనమలూరు: గోసాలలో బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా అందజేశారు. గ్రామంలో ఆదివారం సర్పంచి సంగెపు శ్రీనివాసరావు రూ.10 వేల బీమా సొమ్ము అందజేశారు. రాజస్తాన్‌కు చెందిన చిరువ్యాపారి కుటుంబం చాలా సంవత్సరాలుగా గోసాలలో నివసిస్తోంది. ఇంటి యజమాని శనివారం గుండెపోటుతో మరణించారు. ప్రభుత్వం నుంచి ఈ మేరకు సాయం అందించారు. ప్రభుత్వం కులమతాలు, ప్రాంతీయ అసమానతలు లేకుండా బాధితులను ఆదుకుంటోందని సర్పంచి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో నేతలు బాషా, బాలాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

210 మందికి ఉచిత వైద్యసేవలు



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లిలో ఆదివారం విజయవాడ రవి న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 210 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ పసుమర్తి రవి మాట్లాడుతూ ఆహార అలవాట్ల మార్పుతో మంచి జీవనశైలి అలవరుచుకోవాలని చెప్పారు. డాక్టర్ సూర్యతేజ, డాక్టర్ భాస్కర్ ప్రకాష్ రోగులకు సేవలందించారు. మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాస్, బడుగు ప్రసాద్, లీలాప్రసాద్ సేవలందించారు.

విద్యార్థులకు పోటీలు



గన్నవరం రూరల్: మండలంలోని చినఅవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు కళాశాల ఎన్ఎస్ఎస్, జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మేరా మట్టి, మేరా దేశ్ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విప్లవ సమరయోధుడు బిర్సా ముండాకు వక్తలు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ జె.వందన, జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి సుంకర రాము, కో–ఆర్డినేటర్ బి.వినోద్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి ప్రశాంతి, పవిత్ర, దీవెన పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం



ఉయ్యూరు: జాతీయ ఎన్‌సీసీ దినోత్సవం ఉయ్యూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు, జెడ్పీ పాఠశాల, ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో క్యాడెట్లు, విద్యార్థుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. లయన్స్ జిల్లా కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్ కుమార్ ఎన్‌సీసీ ఆవశ్యకతను వివరించారు. ఎన్‌సీసీ, జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామ్, ఎన్‌సీసీ అధికారులు జీవీ రమణ, శ్రీరామ్, లయన్స్ ప్రతినిధులు రామసత్యకిషోర్, నల్లా శ్రీనివాస్, దినవాహి ప్రసాద్ పాల్గొన్నారు.

మానవత సంస్థకు రూ. లక్ష విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ హనుమాన్ జంక్షన్ శాఖ నూతన భవన నిర్మాణానికి ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మారుబోయిన మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి శాశ్వత భవనాన్ని హనుమాన్‌జంక్షన్ శాఖ నిర్మించడం హర్షణీయమన్నారు. తొమ్మిది నెలల్లోనే పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధం చేయడం మానవత సభ్యుల కృతనిశ్చయానికి నిదర్శనమని కొనియాడారు. ఈ నూతన భవనానికి తనవంతుగా రూ.1,11,111 విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారి పాల్ప్రోలు గణేష్‌కు ఆయన అందజేశారు. డిసెంబర్ 3వ తేదీన భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. మానవత సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, నారగాని కొండలరావు, రామచంద్రరావు, సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చాలి



ఉంగుటూరులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ సరోజిని



ఉయ్యూరు మున్సిపాలిటీలో ప్రతిజ్ఞ ..



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి



హనుమాన్‌జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనమలూరు: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కానూరు కామయ్యతోపులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే నేడు అన్ని వర్గాల ప్రజలు హక్కులు వినియోగించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, పార్టీ తాడిగడప అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, వైఎస్సార్ సీపీ నేతలు తుమ్మల వరదీష్, వల్లే నరసింహారావు, వేమూరి బాలకృష్ణ, తుమాటి శ్రీరాములు, అంగిరేకుల సీతారామయ్య, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వడ్లమూడి సరోజిని పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ నేతృత్వంలో రూపొందించిన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ ఆమోదించడం పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. వెల్దిపాడులో సర్పంచ్ లాం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు సర్పంచ్ వర ప్రసాద్, ఎంపీడీవో శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నలీవేంద్రం రామకృష్ణ, సీమయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ బద్ధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, ఎండీ బేగ్, మెప్మా అధికారి వెంకయ్య, ఏఈ రాజేష్, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకులు పినమాల నాగకుమార్ ఆధ్వర్యంలో న్యాయవాది సదర్ల ప్రసాదరావు కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు చేవూరి రవి, సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కేఎస్ జగదీశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ పరిపాలనకు కరదీపిక వంటి రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించారంటూ కొనియాడారు. అందుకే ఈ రోజును నేషనల్ లా డే, సంవిధాన దివస్‌గా పిలుస్తూ దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్నవరంలో..

గన్నవరం: స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల జయరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం కల్పిస్తూ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని వక్తలు కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షులు నీలం ప్రవీణ్‌కుమార్, పార్టీ నేతలు పడమట సురేష్, తిరివీధి రంగారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: రాజ్యాంగ ఆమోద దినోత్సవం మద్దూరు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎం 21 టీమ్ ఆధ్వర్యంలో గ్రామంలో సైకిల్ ర్యాలీ చేశారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ వర్ధిల్లుతూ, ప్రతి పౌరుడు స్వాతంత్ర్యం ఫలాలు అనుభవిస్తుండటానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి కారణమని పలువురు ప్రజా ప్రతినిధులు కొనియాడారు. బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాభాయి నేతృత్వంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ విశిష్టతను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్, క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఐనంపూడి ఆశీర్వాదం, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాల సంక్షేమం

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- ఈడుపుగల్లులో గడప గడపకు మన ప్రభుత్వం



ఈడుపుగల్లులో సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: జగనన్న పాలనలోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఈడుపుగల్లు గ్రామ సచివాలయం-1 పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పడమర వైపు, వినాయకుడి గుడి, కాలువ కట్ట, డాము సెంటరు, చింతల తోట ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించి, ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి, సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, డ్రెయినేజీ సమస్యలు, ఇళ్ల స్థలాల సమస్యలను ప్రజలు వివరించారు. సమస్యలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రతిపక్షాలు మాత్రం ప్రజలకు మంచి జరగడాన్ని, సంతోషంగా ఉండటాన్ని చూసి ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. అభూత కల్పనలతో ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని, దీనికి ఎల్లో మీడియా వత్తాసు పలుకుతోందని మండిపడ్డారు. వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారని స్పష్టంచేశారు.

రైతులకు అండగా నిలుస్తాం

రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. చలివేంద్రపాలెం, దావులూరు, కంకిపాడు, మంతెన గ్రామాలకు చెందిన రైతులు ధాన్యం రవాణా విషయంలో ట్రాక్టర్లపై 8 టన్నులు మించి అవకాశం ఇవ్వకపోవటంతో అధికారుల నుంచి సమస్య ఎదురవుతుందని, దీనికి 12 టన్నుల వరకూ పొడిగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని విజ్ఞప్తిచేశారు. ఆర్‌బీకే ద్వారా రాతపూర్వక ఉత్తర్వులు పౌరసరఫరాల శాఖ డీఎంకు పంపేలా మాట్లాడామని, ఆందోళన చెందొద్దని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, పార్టీ పెనమలూరు మండలాధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, ఎంపీటీసీలు బూరగ బాలాజీ, షేక్ అమీనాబి, నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, నకరికంటి శేఖర్, బిళ్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



పెదపులిపాకలో హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి

పెనమలూరు: పెదపులిపాకలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మూడు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద 40 మందికి లబ్ధి చేకూర్చామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గృహాల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపిక చేశామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో 72 మందికి హెల్త్ కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంతో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని వివరించారు. డ్రోన్ ద్వారా పంట పొలాలకు పురుగు మందులు పిచికారి చేసే విధానం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఏవో లోయ శివశంకర్, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తిక శోభ



ఈడుపుగల్లు శివాలయంలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



నున్నలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కంకిపాడు: కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తిక మాసంలో అతి ముఖ్యమైన పౌర్ణమి కావటంతో భక్తులు ఆలయాలకు చేరుకుని దీపాలను వెలిగించి, పౌర్ణమి నోము ఆచరించారు. కంకిపాడు, ఈడుపుగల్లు, మంతెన, ప్రొద్దుటూరు, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో జ్వాలా తోరణం వెలిగించారు. ఆలయాలు విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా దర్శనమిచ్చాయి. ఈడుపుగల్లు శివాలయంలో దేవినేని రాజా మిత్రబృందం, శివాలయం భక్త బృందం ఆధ్వర్యంలో పౌర్ణమి పురస్కరించుకుని ఆరువేల మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పేరంటాలమ్మ ఆలయంలో కార్తిక పూజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి ఉదయం నుంచే అధిక సంఖ్యలో మహిళలు హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వెలిగించిన జ్వాలా తోరణాన్ని భక్తులు దర్శించుకున్నారు. ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. ఆలయంలో ఏర్పాట్లను ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

నున్నలో..

నున్న(విజయవాడరూరల్): కార్తిక మాసం సందర్భంగా నున్నలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి వార్ల దేవస్థానాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల, కార్తిక దామోదరుని సన్నిధిలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు నున్నలో గ్రామసభ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. ఈ ఏడాది గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టాల్సిన పనులను గ్రామసభలో చర్చించి తీర్మానం చేయనున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ రహదారిపై బాపులపాడు మండలం కానుమోలు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. నందివాడ మండలం జొన్నపాడుకు చెందిన ముదిగొళ్ల వీరేంద్ర కుమార్ (28) హనుమాన్ జంక్షన్‌కు ద్విచక్రవాహనంపై వస్తుండగా దంటగుంట్ల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో వీరేంద్ర కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డీఎస్పీ కృపాకర్‌కు నివాళులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రధాని నరేంద్రమోదీ తిరుమల పర్యటనలో భద్రతా విధుల నిమిత్తం మెట్ల మార్గం నుంచి కాలినడకన తిరుమలకు వెళ్తున్న ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ) డీఎస్పీ పి.కృపాకర్ గుండెపోటుకు గురై శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని పోలీసు ఉన్నతాధికారులు పోరంకిలోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఆయన భౌతికకాయాన్ని డీఐజీ రఘురామిరెడ్డి, ఎస్ఎస్‌జీ ఎస్పీ అట్టాట బుజ్జి, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా, ఇతర పోలీసు ఉన్నతాధికారులు సందర్శించి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కృష్ణలంకలోని స్వర్గపురిలో ఆయన కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కృపాకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వణుకూరు నుంచి ధాన్యం.. మిల్లుకు తరలింపు

పెనమలూరు: రైతులు పండించిన ధాన్యం మొదటి లోడ్ ఆదివారం వణుకూరు నుంచి మిల్లుకు తరలించారు. పెనమలూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు వేమూరి రాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేపట్టిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర చెల్లించనుందన్నారు. దీనిలో భాగంగా గ్రామం నుంచి మొదటి ధాన్యం లోడ్ లారీ దాదాపు 497 బస్తాలతో గంగూరు వెంకటాద్రి మిల్లుకు వెళ్లిందన్నారు. రైతులు ఆర్బీకేల ద్వారా ధాన్యం అమ్ముకాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు యార్లగడ్డ లక్ష్మీజయరామ్‌ప్రసాద్, రావి రమేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన

ఉయ్యూరు: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సీడీసీ చైర్మన్ రామచంద్రరావు, కౌన్సిలర్లు పూర్ణిమ, ఊర శ్రీవాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండలరావు పాల్గొన్నారు. ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

నున్న(విజయవాడ రూరల్): ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలంపలి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. నున్న గ్రామంలోని చాగంటి లక్ష్మారెడ్డి మామిడితోటలో బెజవాడ అవుట్‌డోర్ అండ్ స్టూడియోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా లూయిస్ డాగ్యురో చిత్రపటానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు యతిరాజుల శ్రీనివాసరావు, సోమిశెట్టి శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కుటుంబసభ్యులతో ఆనందోత్సాహాలతో గడిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316డి, రాష్ట్ర మల్లారెడ్ల సేవాసంఘం, చినకంచిలో విజయవాడ సెంట్రల్ కమిటీ గౌడ, శ్రీశైవ, బలిజ,సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ముందుగా ఉసిరిచెట్టుకు పూజలు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఫోరం ప్రతినిధులు

రామవరప్పాడు : ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో 4వ రాష్ట్రస్థాయి ఉత్తమ సాంఘిక శాస్త్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని విజయవాడరూరల్ మండలం నిడమానూరు జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో సాంఘిక శాస్త్రంలో కృషి చేసిన ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో సాంఘిక శాస్త్రానికి విశేష సేవలను అందించిన వారిని ఫోరం తరపున గుర్తించడం మంచి పరిణామమన్నారు. అనంతరం 13 జిల్లాల నుంచి జిల్లాకి ఒక్కొక్కరి చొప్పున 13మందిని గుర్తించి వారిని ఘనంగా సన్మానించారు. అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కునాటి సురేష్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కెఎస్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్రం మురళీమోహన్, జిల్లా బాధ్యులు బి.శ్రీనివాసరావు, ఎస్.శేఖర్, రహీం, జాన్ ప్రసాద్, శ్రీనివాసరావు, రామారావు, నిడమానూరు జెడ్పీ పాఠశాల హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరులో చిన్నారితో కలిసి రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, స్థానికులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన ఆదివారం కానూరు 100 అడుగుల రోడ్డులో ఇన్‌కం ట్యాక్స్ ఆఫీసర్స్ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీ చేసిన తర్వాత కానూరు, పోరంకి, యనమలకుదురు, తాడిగడప ప్రాంతాల్లో అభివృద్ధి పనులు శరవేంగా చేస్తున్నామన్నారు. అభివృద్ధి జరగటం లేదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఖండించారు. విమర్శలు చేసేవారు తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అభివృద్ధి చూడాలని హితవు పలికారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. త్వరలో మరో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, నేతలు అన్నే శ్రావణ్‌కుమార్, చాంద్‌బాషా, ఖాదర్, వేమూరి బాలకృష్ణ, తుమాటి శ్రీరాములు, క్రిస్టోఫర్, ఆంజనేయప్రసాద్, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో విద్యార్థిని అదృశ్యమవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం సనత్‌నగర్‌కు చెందిన లేబర్తి లక్ష్మి, అప్పారావుకు పదో తరగతి చదువుతున్న కుమార్తె ఉంది. విద్యార్థిని విజయవాడ వన్‌టౌన్‌లోని హాస్టల్‌లో ఉంటోంది. ఆమె ఇంటికి వచ్చి ఈ నెల 23వ తేదీన తిరిగి హాస్టల్‌కు వెళ్లింది. హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి కుమార్తె హాస్టల్‌కు రాలేదని తెలిపాడు. వారు పలు ప్రాంతాల్లో వెదికినా విద్యార్థి జాడ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భర్తపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరుకు చెందిన మేడేపల్లి అరుణకుమారి 2007లో అధ్యాపకుడు వెంకయ్యను ప్రేమ వివాహమాడింది. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా భర్త.. వరకట్నం తీసుకురావాలని అరుణకుమారిని వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు పుట్టింటి నుంచి సొమ్ము తీసుకు వచ్చి భర్తకు ఇచ్చింది. అయినా భర్త వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.